క్లుప్తంగా

కేన్సర్‌పై అవగాహన

ముత్తుకూరు: కేన్సర్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అవగాహన పెంచుకోవాలని హోమీబాబా కేన్సర్ హాస్పిటల్ – రీసెర్చ్ సెంటర్ వైద్యులు డీపీఎస్ దీప్తి అన్నారు. మండలంలోని పంటపాళెంలో శుక్రవారం ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సహకారంతో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి 82 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. సీఎస్సార్ ద్వారా ఈ సామాజిక కార్యక్రమం చేపట్టినట్టు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో అన్నాభిషేకం

ముత్తుకూరు: మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా కృష్ణపట్నం గ్రామంలోని సిద్ధేశ్వరాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఇందులో భాగంగా వేదపండితులు అన్నాభిషేకం, అన్నలింగ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నాణ్యత ప్రమాణాలను పాటించండి

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలో చేపట్టిన మార్కెట్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజ పేర్కొన్నారు. మార్కెట్ నిర్మాణ పనులను వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డితో కలిసి శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. కొలతల్లో ఎలాంటి వ్యత్యాసాలు రాకుండా చూడాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మార్కెట్ విస్తరణ పనుల కారణంగా చాలా మంది వ్యాపారులు ఉపాధి కోల్పోయారని, వీరి జీవనోపాధిని దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కౌన్సిలర్ రాచూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కోర్సు ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో సర్వీస్ ప్రొవైడర్లకు మెప్మా ద్వారా ఎలక్ట్రీషియన్ శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడం శుభపరిణామమని చైర్‌పర్సన్ సుప్రజ పేర్కొన్నారు. శిక్షణను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. శిక్షణ ఇచ్చి హోమ్ ట్రయాంగిల్ ద్వారా రూ.పది వేల నుంచి రూ.15 వేల ఆదాయాన్ని కల్పించనున్నారని వివరించారు. ఐబీ అంకయ్య, నర్మద తదితరులు పాల్గొన్నారు.

నకిలీ సీడ్‌తో నష్టం



ఎదుగుదల లేని రొయ్యలను చూపుతున్న ఆక్వా రైతులు

ముత్తుకూరు: వెనామీ రొయ్యలకు సంబంధించి నకిలీ సీడ్ (విత్తనం) కొనుగోలు చేసిన ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోయిన ఘటన మండలంలో జరిగింది. పోలంరాజుగుంట గ్రామానికి చెందిన ఆక్వా రైతులు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బుచ్చిరెడ్డిపాళెం సమీపంలోని రేబాలలో (జీఎస్‌టీ) గణేష్‌సాయి తిరుమల హేచరీ నుంచి డిసెంబర్ 21న తేదీన వెనామీ సీడ్‌ను కొనుగోలు చేశామన్నారు. ఒక్కో రొయ్య పిల్లను రూ.30 పైసల చొప్పున కొనుగోలు చేసి లక్షల సంఖ్యలో చెరువుల్లో వదిలామన్నారు. 80 నుంచి 100 కౌంట్ వరకు పెరగాల్సిన రొయ్యలు 275 కౌంట్‌కే పరిమితమైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పదిమందికిపైగా వందెకరాల్లో పెంపకం చేసి సుమారు రూ.2 కోట్లకుపైగా నష్టపోయామన్నారు. మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే వారు ఎటువంటి చర్యలు తీసుకోలేదని నిరసన తెలిపారు. మందులు, మేత ఖర్చులు, విద్యుత్ బిల్లులు పెరగడం తప్ప రొయ్యలు ఎదుగుదల లేకపోవడంతో హార్వెస్ట్ చేసి నెల్లూరు మార్కెట్‌కు తరలిస్తున్నామని వెల్లడించారు. నకిలీ సీడ్ కొనుగోలుకు చెల్లించిన డబ్బును హేచరీ నిర్వాహకులు తిరిగివ్వాలని కోరారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, నకిలీ సీడ్ అమ్మకాల ద్వారా రైతులను నష్టాల పాలుచేస్తున్న హేచరీని మూసివేయాలని డిమాండ్ చేశారు.

పశువులకు గాలికుంటు నివారణ వ్యాక్సిన్

ఇందుకూరుపేట: పశువులకు గాలికుంటు నివారణ వ్యాక్సిన్‌ను వేసే కార్యక్రమాన్ని శనివారం నుంచి ఈ నెలాఖరు వరకు నిర్వహించనున్నామని పశుసంవర్ధక శాఖ ఏడీ మురళీకృష్ణ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను ముదివర్తిపాళెం పశు వైద్యశాలలో శుక్రవారం ఆవిష్కరించారు. ముదివర్తిపాళెం, మైపాడు పశు వైద్యాధికారులు హరిబాబు, అస్లామ్ అక్తర్ పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీలు

కొడవలూరు: రామన్నపాళెంలోని సచివాలయాన్ని ఎంపీడీఓ సుబ్బారావు శుక్రవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలపై పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై విహారం

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని రామకృష్ణనగర్‌లో వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి మోహినీ అవతారంలో శుక్రవారం ఉదయం దర్శనమిచ్చారు. గరుడవాహనంపై పురవీధుల్లో రాత్రి విహరించారు. కాగా స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని శనివారం ఉదయం తొమ్మిదికి నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

విడవలూరు: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలలు, కళాశాలల్లో సైన్స్ నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు.

⇨ స్థానిక పీఆర్‌ఆర్ – వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపల్ సుజాత, యూత్ ఆఫీసర్ మహేందర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ మధు తదితరులు పాల్గొన్నారు.

⇨ కొడవలూరు: యల్లాయపాళెంలోని జెడ్పీ హైస్కూల్లో వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. వివిధ సైన్స్ ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. తొలుత సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. హెచ్‌ఎం మోహనరామలింగయ్య, ఉపాధ్యాయులు మల్లికాదేవి, తిరుమలయ్య, విజయబాబు, గాయత్రి, నేతలు వంశీధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రియాజ్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

⇨ బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. సీవీ రామన్ పురస్కార గ్రహీత గండికోట సుధీర్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు చింతంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు బ్రహ్మారెడ్డి, వేదవతి, నిర్మల, వేణు, మున్వర్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

⇨ ఇందుకూరుపేట: పల్లిపాడులోని డైట్ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

⇨ కోవూరు: పట్టణంలోని రత్నం ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు: యల్లాయపాళెం జెడ్పీ హైస్కూల్లో..

⇨ పొదలకూరు: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రభుత్వం, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. స్థానిక డీఎన్నార్ జెడ్పీ బాలుర హైస్కూల్లో సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు 70 నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.సనత్, సైన్స్ ఉపాధ్యాయులు ఏవీ సుధాకర్, వాణి లక్ష్మీకుమారి, నాగరాజు పాల్గొన్నారు.

⇨ మండలంలోని మహ్మదాపురం, తాటిపర్తి, విరువూరు జెడ్పీ హైస్కూళ్లలో సైన్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నమూనాలను ప్రదర్శించారు. ఎంఈఓ – 2 శోభనాద్రి, హెచ్‌ఎంలు, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పట్టణంలోని విజేత స్కూల్లో విద్యార్థులు రూపొందించిన నమూనాలను ఎంఈఓ – 1 రేణుక పరిశీలించి అభినందించారు. అమరావతి స్కూల్లో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన సైన్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ కె.సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నాగార్జున స్కూల్లో పిల్లలు సైన్స్ నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సునీతారెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీదుర్గా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

⇨ తోటపల్లిగూడూరు: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని పలు పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించారు. సీవీ రామన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సౌత్ ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. స్థానిక సర్పంచ్ చెరుకూరు సరళకుమారి విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ గిరిజాకుమారి, హెచ్‌ఎం షేక్ అహ్మద్‌బాషా, విద్యుల్లత, కృష్ణవేణి పాల్గొన్నారు.

వీఎస్‌యూలో..

⇨ వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత వికసిత భారత్ కోసం గ్లోబల్ లీడర్‌షిప్‌లో భారత యువతను శక్తివంతం చేయడం అనే అంశంపై మాట్లాడారు. కార్యక్రమంలో వీఎస్‌యూ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ హనుమారెడ్డి, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ విజయానంద్‌కుమార్ బాబు, డాక్టర్ ఎ.శివశంకర్, డాక్టర్ మేరీ సందీప, పి.త్రివేణి పాల్గొన్నారు.



పొదలకూరు: విజేత స్కూల్లో నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ



పొదలకూరు: అమరావతి స్కూల్లో ప్రాజెక్ట్‌ల ప్రదర్శన



బుచ్చిరెడ్డిపాళెం: రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో..



టీపీగూడూరు: సౌత్ ఆములూరు ప్రాథమికోన్నత స్కూల్లో..



వెంకటాచలం : మాట్లాడుతున్న రిజిస్ట్రార్ సునీత



విడవలూరు: మాట్లాడుతున్న మధు



పొదలకూరు: డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్లో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులు

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

పొదలకూరు: ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. పొదలకూరులో పరీక్షలు రాసేందుకు రెండు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మొదటి సంవత్సరం విద్యార్థులు 355 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 325 మంది పరీక్షలను రాయనున్నట్టు ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ శుక్రవారం వెల్లడించారు. సీఎస్‌గా ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, డీఓగా కృష్ణను నియమించారు. రెండో కేంద్రంగా విజ్ఞాన్ జూనియర్ కాలేజీను కేటాయించారు. ఇక్కడ మొదటి సంవత్సరం 265 మంది, రెండో సంవత్సరం 170 మంది పరీక్షలు రాయనున్నారు. సీఎస్‌గా పచ్చపాల పెంచలయ్య, డీఓగా యల్లయ్య వ్యవహరిస్తారు. ఆయా కేంద్రాల్లో సర్వం సిద్ధంగా చేసినట్టు అధికారులు వెల్లడించారు.

⇨ తోటపల్లిగూడూరు: మండలంలోని తోటపల్లిగూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపల్ ధనుంజయ తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఇక్కడి పరీక్ష కేంద్రంలో తోటపల్లిగూడూరు కళాశాల విద్యార్థులతోపాటు కోడూరు గురుకుల బాలికల కళాశాల, ఇందుకూరుపేటలోని వశిష్ట జూనియర్ కళాశాల, ఇందుకూరుపేట, నరసాపురం ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ప్రత్యేక కళాశాలలకు చెందిన 290 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. శనివారం ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి తెలుగు పరీక్ష జరుగుతుందన్నారు. 13 గదుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పరీక్షలను పక్కాగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.

డాక్టరేట్ ప్రదానం

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని సెయింట్ మేరీస్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న కోసూరు కొండయ్యకు డాక్టరేట్‌ను మధురై కామరాజు యూనివర్సిటీ ప్రదానం చేసింది. నిమ్న జాతులకు చెందిన మహిళల కష్టాలపై అధ్యయనం చేసినందుకు గానూ డాక్టరేట్‌ను అందజేశారు.

వారానికి ఒకరోజు సైకిల్‌పై..

• జెన్‌కో ఉద్యోగుల నిర్ణయం

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్ ఉద్యోగులు వినూత్న నిర్ణయం తీసుకున్నారు. వారానికి ఒకరోజు ఇళ్ల నుంచి సైకిల్ తొక్కుకుంటూ విధులకు హాజరై, సాయంత్రం వాటిపై తిరిగివెళ్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జెన్‌కో సీఈ సుధీర్‌బాబు పర్యవేక్షణలో కొంతకాలంగా ప్రతి శుక్రవారం ఈ పని చేస్తున్నారు. పైస్థాయి నుంచి కింద స్థాయి వరకు మహిళలు, పురుషులు సైకిల్‌పై రాకపోకలు సాగిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, శారీరక దృఢత్వం, ఇంధన పొదుపు, డబ్బు ఆదా తదితర అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ ఇలా చేస్తున్నట్టుగా ఇంజినీర్లు వెల్లడించారు.



సైకిళ్లపై ఇళ్లకు బయలుదేరిన ఉద్యోగులు

ముగిసిన కబడ్డీ, వాలీబాల్ కోచింగ్ క్యాంప్

వెంకటాచలం: మండలంలోని సరస్వతీనగర్ వద్దనున్న అలెక్సా కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రాంగణంలో మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాలుగురోజులుగా జరుగుతున్న కబడ్డీ, వాలీబాల్ కోచింగ్ క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. దీనికి హాజరైన వివిధ పాఠశాలల విద్యార్థులకు బుచ్చిరెడ్డిపాళెం సీఐ శ్రీనివాసులురెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డీకేడీబ్ల్యూ పీడీ విజయకళ, క్యాంప్ నిర్వాహకులు వెంకటసుబ్బయ్య, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ మేనేజర్ ఆనంద్, కో–ఆర్డినేటర్ సుమంత్ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న సీఐ శ్రీనివాసులురెడ్డి

నేత్రపర్వంగా రథోత్సవం



కొడవలూరు: గండవరంలో కొలువైన గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని నేత్రపర్వంగా శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ కృష్ణ ప్రారంభించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తును కొడవలూరు సీఐ సురేంద్రబాబు, కొడవలూరు, విడవలూరు ఎస్సైలు కోటిరెడ్డి, నరేష్‌యాదవ్ నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, ఆలయ చైర్మన్ ఆలం మాలకొండయ్య, ఈఓ బండి శాంతయ్య, సర్పంచ్ రాజకుమారి, సభ్యులు గుర్రాల భవాని, నేతలు పెనాక వెంకటేశ్వర్లురెడ్డి, బచ్చు సురేష్, కోటయ్య, యస్దానీబాషా పాల్గొన్నారు.

కనులపండువగా తెప్పోత్సవం

గండవరంలోని గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైన తెప్పోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. శోభాయమానంగా అలంకరించిన తెప్పపై స్వామి, అమ్మవార్లు కొలువుదీరారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హాజరై దర్శించుకున్నారు. అనంతరం సినీ గాయకులు సునీత, సమీరా భరద్వాజ్, హారికా నారాయణ్ బృందంతో నిర్వహించిన పాట కచ్చేరి అలరించింది.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం



పొదలకూరు: ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

పొదలకూరు: మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం స్థానిక కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం కమనీయంగా సాగింది. ఆర్యవైశ్య సంఘం ఉభయకర్తగా వ్యవహరించింది. భక్తులకు వెంకటచలపతి – సునీతా లక్ష్మి అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ప్రసాద్‌స్వామి, శివస్వామి, కుమార్‌స్వామి, రమేష్‌స్వామి, మనోహర్‌స్వామి, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా రామలింగేశ్వరుడిని గజ వాహనంపై ఊరేగించారు. ఉభయకర్తలుగా ఆర్యవైశ్యులు వ్యవహరించారు.

బెట్టింగ్‌లకు బానిసలు కావొద్దు

కోవూరు: బెట్టింగ్‌లకు బానిసలుగా మారొద్దని ట్రెయినీ డీఎస్పీ శివప్రియ, ఎస్సై రంగనాథ్‌గౌడ్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో విలేకరులతో శుక్రవారం వారు మాట్లాడారు. చైన్ స్నాచింగ్‌కు గురువారం పాల్పడి పట్టుబడిన ఎఫ్‌ఎన్వోలు వాసుకి, జీవితను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చామని చెప్పారు.

డిగ్రీ పరీక్షలకు 150 మంది హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శుక్రవారం జరిగిన డిగ్రీ ఒకటో సెమిస్టర్, నాలుగో సెమిస్టర్ పరీక్షలకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు తెలిపారు. 155 మందికి గానూ 150 మంది హాజరయ్యారని వెల్లడించారు.

కోడిపందేల స్థావరంపై పోలీస్ దాడులు

పొదలకూరు: మండలంలోని అమ్మవారిపాళెం పొలాల్లో శుక్రవారం కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించి నలుగురు వ్యక్తులను పట్టుకున్నారు. రెండు పందెం కోళ్లు, రూ.4,500 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై ఎస్‌కే హనీఫ్ వెల్లడించారు.

తహసీల్దార్ కార్యాలయ ఎదుట ఆందోళన



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

కోవూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఎదుట ఆందోళనను రైతులు శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా నేత గండవరపు శేషయ్య మాట్లాడారు. పాటూరు, పోతిరెడ్డిపాళెంలో రైతులు తమ ధాన్యాన్ని దళారుల ద్వారా విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. నేతలు ఎస్‌కే బాబు, శ్రీకాంత్‌రెడ్డి, సురేష్, చాన్‌బాషా, భాస్కర్, పంతంగి శ్రీనివాసరావు విజయకుమార్, ఊటుకూరు రమణయ్య, సురేంద్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.